# గలగలా గోదారి

శ్రీరమణ

కిట్టయ్య మేష్టారని ఏకోపాధ్యాయ పాఠశాలకి మేష్టారుగా వుండే వారు. ఆ వూరిలో తొంభైశాతం జనాభా రైతాంగమే. వ్యవసాయమే జీవనాధారంగా వుండేవారు. వ్యవసాయ మంటే తెలుసుకదరా అబ్బాయ్. నూర్నారాయణమూర్తి సేవకముసుపే నడుంవంచితే, ఆయన పశ్చిమాద్రిచేరిన తర్వాతే పైకెత్తాలి. ఆ రోజులలో ఇప్పట్లో ఎరువులు, అధికోత్పత్తి పథకాలు గట్రాలేవు. కాటన్ దొరపుణ్యమా అని కాలవలో ప్రవహించే గంగమ్మ తల్లి, రెక్కల సత్తువ అవే ఆధారాలు. అటువంటప్పుడు అక్షరమ్ముక్క మీద కన్నా ఆ సమయాన్ని వెచ్చిస్తే అరబస్తా ధాన్యం ఎక్కువ పండుతాయనే ధ్యాస వుండడం సహజం. అటువంటి వూళ్ళో ఒకే ఒక్క పాఠశాల. దానికి ఏకైక అధ్యాపకులు కిట్టయ్య మేష్టారు. ఏ మాట కామాటే చెప్పుకోవాలా. ఆ వూళ్ళో చదువుల తల్లి అడుగు పెట్టిందంటే అది కిట్టయ్యగారి చలవే. ఆ వూళ్ళో అందరికీ మేష్టారంటే గౌరవమే.

అసలు స్వతహాగా కిట్టయ్య మేష్టారిది జమిందారీ వంశం. దొరతనం వాటి ఏలుబడి వచ్చాక, అన్ని జమీలకి

## కిట్టయ్య మేష్టారు

అగ్రహారాలకి పట్టిన గతే కిట్టయ్య మేష్టారి జమాకీ పట్టింది. జమీలు పోయినా, జమిందారీ పౌరుషం పోలేదురా మేష్టారికి. పెట్టిన చెయ్యి కావడంవల్ల, ఇవ్వడానికే చెయ్యి ముందుకెళ్ళేది కానీ, పుచ్చుకోడానికి అంగుళం మేరకూడా కదిలేది కాదురా. మాట అనిపించుకోకుండా బతకడమే తెలుసుకానీ, మాట పడి తల వంచడం మటుకు అబ్బ లేదురా.

జమీలు పోయినా, మిగిలి పోయిన పౌరుషాలు భుక్తి గడవటానికి ఆధారాలు కాకపోవడంవల్ల, ఆ వూళ్ళో కాస్త పెద్ద తలకాయలన్నీ ఒక చోట చేరి ఆలోచించుకుని, ఎప్పుడు పడి పోదామా అన్నట్టున్న కిట్టయ్య మేష్టారి హవేలికి కొచ్చారు. మర్యాదలు జరపడానికి మందీ మార్బలం లేకపోయినా, ఆదరంగా పలకరించడానికి విండైన నోరు కొరవడలేదురా. మిగిలిన ఆ ఆస్తితోటే వచ్చిన వారి నందర్నీ ఆప్యాయంగా లోపలికాహ్వానించి, జమిందారీ తాలూకు వారసత్వంలో మిగిలిపోయిన, సలక్షణమైన, కిలంపట్టని మూారెడు కంచు గ్లాసులలో దబ్బాకు మజ్జిగ అందించార్రా అబ్బాయ్ కిట్టయ్యగారు.

ఆ మజ్జిగ తాగి, ఆ ఆదరణని అనుభవించాక, అసలు విషయం ఎలా కదపడమా అనే సమస్య పట్టుకుందిరా పెద్దలకి. కిట్టయ్యగారితో మాట్లాడటమన్నది లొకాయి లూకాయి వ్యవహారంకాదు. పిల్లి పెసరంత పొరపాటైనా సరే మాటలో దొర్లిందంటే, తలకాయెత్తకుండా నైనా సరే తిరిగి వారితో మాట్లాడటమన్నది ఆ జన్మకి, ఆ శాల్తీ మర్చిపోవచ్చు.

"ఏమిటో విశేషం. పెద్దలందరూ కలిసి విజయం చేసారు. రామనవమి వుత్సవాలు ఇప్పుడప్పుడే కాదుగదా. అందుకని ఏదో ఘనమైన విషయమే అయివుంటుంది." అన్నార్రా కిట్టయ్యగారు.

"ఆయ్... ఇసేసమంటే... తమరన్నట్టు... ఆయ్ చిత్తమంటే" అన్నాడు బుచ్చిరెడ్డి. ఆ వూళ్ళో అన్ని విధాలా పెద్దవాడు. నాలుగొందల ఎకరాకి ఆసామి.

"చిత్తం. చిత్తం. మిమ్మల్ని ఇబ్బంది పెట్టేటంతటది



కాదనుకుంటుంది. మీ సహాకారం, ఆశీర్వచనం లేక పోతే మటుకు, ఈ కార్యం సాధ్య పడదండి. చిత్తం" అన్నాడు కరణం కిట్టయ్యగారితో. ఆ మాత్రం మాట్లాడగలిగిన వ్యక్తి కరణం ఒక్కడే.

"కరణం గారు సెలవిచ్చారంటే విషయం ఏదో ముఖ్యమైనదీ, తిరకాసుతో కూడుకున్నటువంటిదీ అయివుండాలి" అన్నార్రా కిట్టయ్యగారు.

"అమ్మమ్మ. ఎంతమాట. మిమ్మల్ని తిరకాసులో పెట్టే వ్యవహారం నేనెందుకు మనవి చేస్తాను. ఇది మనవూరి భవిష్యత్తుకి సంబంధించిన విషయం అవడం మూలాన తమరి ఆశీస్సుల కోసం వచ్చాం"

"ఆయ్. సిత్తమండి. అంతేనండి" అన్నాడు బుచ్చిరెడ్డి.

"ఊరికి సంబంధించిన దైతే నేనెప్పుడుకాదన్నాను."

"చిత్తం. చిత్తం. విషయమేమిటంటేనండి మన వూరిని ధాన్యలక్ష్మి కటాక్షించినా, ఆ చదువుల తల్లి కొసరి చూపుకూడా చూడడం లేదండి. ఆ లోటు భర్తీ చేయాలనీ..."

"అయ్యో. ఎంత మాట. మన వూళ్ళో పాఠశాలలేక పోవడం శోచనీయమే. మా పూర్వీకులు కూడా ఈ విషయమై యోచించలేదు. ఇప్పటికైనా ఈ సంకల్పం కలిగినందుకు నాకు చాలా ఆనందంగా వుంది."

"చిత్తం. చిత్తం. ఆ కార్యభారం మీరు వహించాలని మా కోరికండి. ఎందుకంటేనండి. మిమ్మల్ని మించిన వారు మా దృష్టిలో మరెవరూ లేరండి. అథవా వున్నా మేమంగీకరించమూ లేమండి."

"అది మీ అభిమానం. ఇంతకీ ఏం చెయ్యమని మీ వుద్దేశ్యం."

"అయ్ సిత్తమండి. మా సన్నా సెదపలకి నాలు గచ్చరమ్ముక్కలు నేర్పమని తమర్ని సేతులొగ్గి అడుగుతున్నామండి" అన్నాడు బుచ్చిరెడ్డి రెండు చేతులూ జోడించి.

"నేనా" అని తెల్లబోయార్రా కిట్టయ్యగారు.

"చిత్తం. చిత్తం. తమరా ఎస్.ఏ. పట్టా పుచ్చుకున్నారాండి. మన వూళ్ళో గుణింతాలు దాటి చదివిన వాళ్ళెవరూ లేరాండి. స్కూలు స్థాపించడానికా దొరతనంవారు సిద్ధంగా వున్నారాయ్. చిత్తం, ఆ విషయాలన్నీ ముందే విచారించి వున్నారండి. తమరు అంగీకరించినట్టయితే, పాఠశాల మన వూళ్ళో స్థాపించడం అయిపోయినట్టే నండి అన్నాడా కరణం.

"అది కాదు కరణంగారు. నేను పాఠాలు చెప్పడ మేమిటండీ" అని అంటున్న కిట్టయ్య గారి మాటలకడ్డు పడి.

"ఆయ్: సిత్తమండి. తమరు 'సై' అని అంటేనే

కానండి మా వెవళ్ళం మా యిళ్ళ కెళ్ళవండి. పచ్చిగంగ కూడా ముట్టవండి" అని బుచ్చిరెడ్డితో సహా అందరూ అనడంతో కిట్టయ్యగారికి ఒప్పుకోక తప్పలేదురా అబ్బాయ్.

ఆ విధంగా, ఆ వూళ్ళో ఏకోపాధ్యాయ పాఠశాల ప్రారంభమయిందిరా. నయానో, భయానో, ఆ వూళ్ళో సత్తరకాయలకి చదువుల తల్లి కటాక్షం ప్రసరింప జేయసాగా రా కిట్టయ్యగారు. మేష్టారు చెప్పే కథల మీద ఆసక్తి చేతో, బడికెళ్ళక పోతే వీపు కాస్తా చాకలి బండయి పోతుందేమోననే భయం చేతో, ఆ ఏకో పాధ్యాయ పాఠశాల నిండుగా వున్నట్టని పించసాగింది.

ఆ విధంగా, ఆ వూళ్ళో అక్షరమ్ముక్కని వ్యాపింప జేస్తూన్నందుకుగ్గాను, వారికి కాలమానం ప్రకారం దొర తనం వారు వడ్డన సాగిస్తూనే వున్నారు. అదీ, కరిగిపోగా మిగిలిన కమతం లోంచి రాలిన గింజల తోటే పౌరుషానికి దీటు లేకుండా గుట్టుగా నెట్టు కొస్తున్నా రా కిట్టయ్య మేష్టారు.

రోజులలా ప్రశాంతంగా వెళ్ళి పోతుంటే చెప్ప కోడానికి కథలేముంటాయిరా అబ్బాయి.

పాఠశాల పోషణార్థమై దొరతనంవారు కొంత ధనాన్ని వ్యయిస్తున్నారు కనుక అజమాయిషీకి కొంత ఏర్పాటు చెయ్యడమూ సహజమే కదా.

ఆ జిల్లా కంతటికీ నర్సాపురం టైలరు హైస్కూలు ప్రధానోపాధ్యాయులే విద్యాధికారిగా వుండేవారు. అంటే డి.ఇ.ఓ. అన్నమాట. వారి కింద కొందరు ఇన్ స్పెక్టర్లు కూడా వుండేవారు. విద్యాధికారిగా రామయ్య పంతులు గారని ఒకాయన వుండే వారులే. బహు దొడ్డ మనిషి. ఇన్ స్పెక్టర్‌గా కామేశం గారని ఒక కాయనో వుండే వారులే. తలవంచడం తెలియని కిట్టయ్య మేష్టారంటే ఆయనకి గుర్రుగా వుండేది. అదొకటే గాకుండా, కిట్టయ్యగారిని తప్పించి, ఆ స్థానంలో తన బావమరిదిని కూచోపెడదామనే ఆలోచన కూడా వుందిరా అబ్బాయ్. కామేశంగారు ఆ విధంగా అతలాం కుతలాం అవు తున్నా, కిట్టయ్య మేష్టార్ని సాధించడాని కేవిధంగానూ అవకాశం చిక్క లేదు పాపం. ఏదో విధంగా తన అక్కసు తీర్చుకోవాలని యోచిస్తున్నా రా సదరు కామేశంగారు.

రోజులా విధంగా గడుస్తున్నాయిరా.

కామేశంగారు తనిఖీకి బయల్దేరారన్న వార్త కిట్టయ్య గారిని చేరిందిరా అబ్బాయ్. అందుకు తగ్గ ఏర్పాట్లన్నీ సిద్ధం చేసుకునే వున్నారాయన. సదరు కామేశంగారు తనిఖీకి వచ్చే సమయానికి పిల్లలందరూ స్నానాలు గట్టాచేసి పాఠశాలలో హాజరుగా వున్నారు. హాజరు పట్టీ వగైరాలన్నీ తాజాగా తయారుచేసి వుంచుకు న్నారు కిట్టయ్యగారు.

తనిఖీకి వచ్చిన సదరు కామేశం గారికి వెతకడానికి లోపాలేవీ కనిపించలేదు. ఎలాగైనా సరే, కిట్టయ్య మేష్టారిలో లోపాలు వెతికి పట్టుకుని అడ్డంగా రాసి పారెయ్యాలని నిర్ణయించుకున్న కామేశం గారికి అక్కసు పెరిగిపోయింది.

'ఏవిటండీ మేష్టారూ ఇది. ఈ హాజరుపట్టీ అంతా తప్పుల తడకలా వుంది. నన్ను మాయచెయ్యడానికి ఇప్పటికిప్పుడు తయారు చేసి నట్టుగా వుంది. ప్రభుత్వాన్ని లా మోసం చెయ్యడానికి సిగ్గుండాలి. పైగా పెద్ద వంశంలోంచి వచ్చారు కూడాను.' అన్నా రా కామేశం ఇన్ స్పెక్టరుగారు, మొహం గంటు పెట్టుకుని.

వస్తున్న కోపాన్ని దిగమింగుకుంటూ, "మీరనవస రంగా అభాండాలు వేస్తున్నారు. లోపం ఎక్కడుందో చెప్పండి" అన్నా రా కిట్టయ్యగారు వీలైనంత సౌమ్యంగా

"లోపం ఎక్కడుందేవిటండీ. అంతా తప్పుల తడకే." అంటూ, చేతికి వచ్చినట్టుగా తనిఖీ రిపోర్టు రాసేసి, "నాన్సెన్స్" అంటూ హాజరు పట్టీని గిరా టెట్టా రా విసురుగా సదరు కామేశంగారు.

అది భరించలేని కిట్టయ్యగారు "గాడిదకొడకా" అంటూ రూళ్ళ కర్ర తీసుకుని కామేశంగారి మీదికి దూకా రా.

అబ్బాయ్, చూసి తీరవలసిన ఘట్టంరా అది. పంచె వూడి పోతుంటే రోడ్డు మీద కామేశంగారు పెట్టిన పరుగు వెనకాతల రూళ్ళకర్ర పట్టుకుని కిట్టయ్యగారి దూకుడు, ఆ వెనక చప్పట్లు కొడుతూ పిల్లల పరుగు. ఆ వూరివాళ్ళందరూ ఆ దృశ్యాన్ని కడు రసవత్తరంగా ఆనందించా రా.

అలా పరుగెత్తిన కామేశంగారు ఏకాఎకిన నర్సా పురం వచ్చి, రామయ్యగారి దగ్గర వాలి, వున్నవి లేనివి అన్నీ కల్పించి విన్న వించుకున్నా రా.

రామయ్యగారి దగ్గర్నుంచి కబురందుకున్న కిట్టయ్య మేష్టారు, హాజరు పట్టీని నేలకేసి రాసి, దాన్నిండా సిరా బుడ్డీ ఒలకబోసి, అది చంకనెట్టుకుని, నర్సాపురం చేరా రా అబ్బాయ్.

వచ్చిన కిట్టయ్యగార్ని చూసి, పైకి వస్తానంటున్న నవ్వుని ఆపుకుంటూ "ఏం జరిగింది మేష్టారూ" అన్నా రా రామయ్యగారు.

జరిగిన విషయమూ, కామేశంగారి దుడుకు తనమూ చెప్పి, "హాజరుపట్టీనిండా సిరా ఒంపేసారండీ ఆయన. పైగా నా వంశం గురించి ఎత్తుతాడా ఆ త్రాష్టుడు" అని అసలే విశాలమయిన కళ్ళని మరింత విశాలం చేసి అతి రౌద్రంగా అన్నా రా కిట్టయ్యగారు.


"అప్పుడేం చేసారు మేష్టారూ" అనడిగా రా రామయ్యగారు వీలైనంత గంభీరంగా.

ఒక్క వుదుటున బల్ల మీదున్న రూళ్ళ కర్ర అందుకుని, "గాడిద కొడకా..." అంటూ లేచా రా కిట్టయ్యగారు.

వచ్చే నవ్వుని బలవంతంగా ఆపుకుని, "ఆ... ఆ... ఆగండి మేష్టారు నేను కామేశాన్నికాను" అన్నా రా రామయ్యగారు ఒక అడుగు వెనక్కి వేసి.

"అది కాదండీ" అని తమాయించుకుంటున్న కిట్టయ్యగార్ని ఆపి, "అంత కోపం పనికి రాదు మేష్టారు. నేను చూసుకుంటాను లెండి" అని ఆయనకి నచ్చచెప్పి పంపేసి, కామేశం గారిని పిలిచి మందలించా రా రామయ్యగారు, "అధికార్ని మన స్వార్థానికి వాడు కోకూడదంటూ.

అబ్బాయ్, రూల్సుకన్నా మనుషులకే ఎక్కువ విలువ వుండేదిరా. అందుకే, ఆనాడు మనుషులూ ఆనందంగా వుండేవారు.



## ఇదీ వరస

మనిషనగానే
మామూలు మనిషి దృష్టిలో,
"ఆడా? మగా?" అనే ఆలోచన.

మతస్తుడి మనసులో,
మహమ్మదీయుడా? హిందువా?....

వైద్యుని దృష్టిలో—
రోగా? ఆరోగ్యవంతుడా?

లాయర్ అడుగుతాడు,
"దోషా? నిర్దోషా?" అని

పోలీసు అధికారి అంటాడు—
దొంగా? దొరా?

నీతి పరుడు పలికేది
మంచివాడా? చెడ్డవాడా?

ఇదీ వరుస—
మనిషి, ప్రపంచానికి ప్రతి రూపం.

— చిక్కాల కృష్ణారావు